ఆటల్లో గెలుపోటములు సహజం

ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన ఎమ్మెల్యే జారే దంపతులు

అశ్వారావుపేట రూరల్, జనవరి 13: ఆటల్లో గెలుపోటములు సహజమని, ఒక ఓటమి పలు విజయాలకు నాంది పలుకుతుందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. శనివారం మండలంలోని మామిళ్లవారిగూడెంలో శివాలయం ఆవరణలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన మామిళ్లవారిగూడెం పంచాయతీకి ఎమ్మెల్యే దంపతులు బహుమతి అందజేశారు.

రూ1.50వేల ఎల్‌వోసీ పంపిణీ

మండల పరిధిలోని నారాయణపురంలో ఉన్న రైతువేదికలో గాండ్లగూడెనికి చెందిన సత్యనారాయణకు ఎల్‌వోసీ(లెటర్ ఆఫ్ క్రెడిట్) రూ.1,50,000 ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పంపిణీ చేశారు.

విద్యుత్ తీగల పట్ల జాగ్రత్తగా ఉండాలి

అశ్వారావుపేట, జనవరి 13: విద్యుత్ తీగలు ఉన్న ప్రాంతాల్లో గాలి పటాలు ఎగురవేసే ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని డిస్కం ఏడీఈ వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ తీగలు, సెల్ టవర్ల సమీపంలో గాలి పటాలు ఎగురవేయొద్దని కోరారు. విద్యుత్ శాఖకు ప్రజలు సహకరించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వైభవంగా సుదర్శన హోమం

హోమం నిర్వహిస్తున్న పురోహితులు

అన్నపురెడ్డిపల్లి, జనవరి 13: మండల కేంద్రంలోని బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు సుదర్శన హోమాన్ని నిర్వహించారు. యజ్ఞాచార్యులు గిరిధరాచార్యులు వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా సుదర్శన హోమం నిర్వహించారు. భక్తులు ఆలయంలో పూజలు చేసి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

సెయింట్‌జోసెఫ్ హైస్కూల్ వార్షికోత్సవం

చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

చుంచుపల్లి, జనవరి 13: మండలంలోని ధన్బాద్ పంచాయతీలో ఉన్న సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాత్రి వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, కొత్తగూడెం ఏరియా జీఎం శాలెం రాజు, టూ టౌన్ సీఐ రమేశ్ ముఖ్యఅతిథులుగా పాల్గొనగా పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ రాజశేఖర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ జార్జిరెడ్డి, బ్రదర్ అభిలాష్ పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యాసంవత్సరంలో జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి క్రీడలు, సాంస్కృతిక, వివిధ రంగాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

టేకులపల్లి, జనవరి 13: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి కుటుంబానికి మిత్రులు ఆర్థిక సాయం అందించారు. టేకులపల్లి మండలం 9వ మైలు తండా గ్రామానికి చెందిన తేజావత్ సేవ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అయితే అతడి పాటు కోయగూడెం ఆశ్రమ పాఠశాలలో చదివిన తన క్లాస్‌మేట్స్ అంతా కలిసి రూ.20 వేలను సేకరించి తేజావత్ సేన కుటుంబానికి శనివారం అందజేశారు. కోయగూడెం ఆశ్రమ పాఠశాల పూర్వ విద్యార్థులు జర్పుల రాజేందర్ నాయక్, పడియా వెంకటేశ్వర్లు, భూక్యా రవి, జే.వీరు, కిషన్, శ్రీను, లక్ష్మణ్, వెంకటేశ్, సుమన్, భద్రం, మంగీలాల్, పూల్‌సింగ్, మోహన్, భద్రు తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

OWN BUSINESS OFFER

★18-28 సం॥ల యువతీ యువకులకు Rs. 49,000/- ల స్వల్ప పెట్టుబడిలోనే లోకల్ ఫ్రాంచైజీతో పర్మినెంట్ బిజినెస్ ఆదాయం. మల్టీసర్వీసెస్+ట్రైనింగ్+డైలీ సపోర్ట్ @ 15 సం॥ల నమ్మకమైన సర్టిఫైడ్ సంస్థ W.W.I-Hyd. Ph: 9908743603. NT-2580-All

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

JOBS

★నిరుద్యోగులకు ఉపాధి అవకాశం ప్రముఖ సంస్థ నందు అభ్యర్థులు కావలెను. ఏరియా ఇంచార్జ్, ఏరియా మేనేజర్ మండల కో-ఆర్డినేటర్, జీతం 15 వేల నుండి 30 వేల వరకు. సెల్ : 9963483482, 9642559255 KMM

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616

సరిహద్దుల్లో కోడిపందేలు షురూ..

ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు

ఇప్పటికే ఆంధ్రాకు బాటపట్టిన పందెం రాయుళ్లు

మూడు రోజులపాటు సందడి చేయనున్న పందెం కోళ్లు

కోడిపందాల నిర్వహణకు బరులను సిద్ధం చేస్తున్న నిర్వాహకులు; పండుగకు కోడిపందాలు నిర్వహిస్తున్న జూదరులు(ఫైల్(ఇన్‌సెట్)

అశ్వారావుపేట టౌన్, జనవరి 12: తెలుగు రాష్ట్రాల్లో అత్యంత సందడి వాతావరణం కనబరిచే పండుగల్లో సంక్రాంతి పండుగ ఒకటి. సంక్రాంతి వచ్చిందంటే రెండు రాష్ట్రాల్లోని ప్రతి గ్రామం కోడి పందాలతో సందడిగా కనిపిస్తుంది. సరిహద్దు గ్రామమైన అశ్వారావుపేట పరిసర ప్రాంత ఆంధ్రా గ్రామాలతోపాటు ఇతర ప్రధాన పట్టణాల్లో ఆదివారం నుంచే కోడిపందేల కోసం పందెం రాయుళ్ళు ఆంధ్రాకు తరలివెళ్లారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి గ్రామంలో కోడిపందాల నిర్వహణకు కావలసిన పందెం బరిలను సిద్ధం చేస్తున్నారు. కోడిపందేలతో పాటు ఇతర జూదాలు గుండాట, పేకాట వంటి జూదాలు కోడిపందాల స్థావరాల వద్ద జరగనుండడంతో సంక్రాంతికి పందెం రాయుళ్లు సర్వం సిద్ధం చేసుకున్నారు.

మండలంలో ఎమ్మెల్యే తెల్లం పర్యటన

సమ్మక్క సారలమ్మల ఆలయం వద్ద కార్యకర్తలు, అభిమానులతో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

చర్ల, జనవరి 13: భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శనివారం మండలంలో పర్యటించారు. తొలుత సుబ్బంపేట గ్రామంలో శనివారం జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడ కార్యకర్తలు, నాయకులు, అభిమానులతో మాట్లాడారు. అనంతరం ఎన్నికల్లో తెల్లం వెంకట్రావు విజయం సాధించాలని పార్టీ కార్యకర్తలు, అభిమానులు సమ్మక్క, సారలమ్మ మొక్కుకున్నారు. తెల్లం గెలిచిన అనంతరం కార్యకర్తలు, అభిమానులతో కలిసి వెంకట్రావు ఎదురుగుట్టల్లో సమ్మక్క సారలమ్మలకు మొక్కులు చెల్లించున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు సోయం రాజారావు, పోలిన లంకరాజు, ప్రచార కార్యదర్శి కొటేరు శ్రీనివాసరెడ్డి, నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ఇంటింటికీ 'అయోధ్య రామయ్య' అక్షింతలు

చంద్రుగొండ : అక్షింతలను పంచుతున్న ఆలయ కమిటీ బాధ్యులు, గ్రామస్తులు

చంద్రుగొండ, జనవరి 13: మండల పరిధిలోని అయ్యన్నపాలెంలో అయోధ్య రామయ్య అక్షింతలను శనివారం పంపిణీ చేశారు. ఆలయ కమిటీ బాధ్యులు, రామభక్తుల ఆధ్వర్యంలో కోలాట నృత్యాలు, డప్పు వాయిద్యాలతో భక్తిపాటలు నాట్యం చేస్తూ ఇంటింటికెళ్లి అక్షింతలు అందజేశారు.

ఆళ్లపల్లి : అక్షింతలు అందిస్తున్న చేస్తున్న కమిటి సభ్యులు

ఆళ్ళపల్లి, డిసెంబర్ 13: అయోధ్య రామ జన్మభూమి తీర్థ క్షేత్ర బాధ్యులు అక్కడి నుంచి తెచ్చిన అక్షింతను మండలంలోని వివిధ పంచాయతీల్లో శనివారం ఇంటింటికి పంపిణీ చేశారు. ఆభయ రామాంజనేయ ఆలయం అర్చకులు కొనేటి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి : శోభయాత్ర నిర్వహిస్తున్న రామభక్తులు

అన్నపురెడ్డిపల్లి, జనవరి 13: మండల పరిధిలోని అబ్బుగూడెం, రాజాపురంలో శ్రీరామ భక్తులు అంక్షింతల శోభయాత్ర నిర్వహించారు. గ్రామాల్లో మేళతాళాల నడుమ ఊరేగింపుగా రామ భక్తులు బయలుదేరి ఇంటింటికి అయోధ్య శ్రీరాముడు అక్షింతలను పంపిణీ చేశారు.

సెలవులకు వెళ్తే.. పోలీసులకు తెలపండి

మణుగూరు సీఐ రమాకాంత్

మణుగూరు టౌన్, జనవరి 13: సంక్రాంతి సెలవులకు ఊరెళ్లే వారు పోలీసులకు తెలపాలని మణుగూరు సీఐ రమాకాంత్ కోరారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. మణుగూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు ఊర్లు వెళ్లినప్పుడు. వారి ఇళ్ల రక్షణ కోసం ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఊరికి వెళ్తున్నట్లయితే పూర్తి వివరాలను 63039 22272 నంబరుకు వాట్సాప్ ద్వారా తెలపాలని కోరారు. ఇలా తెలిపిన వారి ఇళ్లు ఉన్న ప్రాంతాల్లో ప్రతి మూడు-నాలుగు గంటలకు ఒకసారి పోలీస్ బృందం పరిశీలిస్తుందని చెప్పా రు. ఊరికి వెళ్తున్నప్పుడు ఇంటి చుట్టుపక్కల వారికి సమాచారం ఇవ్వాలని, వారితో ఫోన్‌లో కాంటాక్ట్‌లో ఉండాలని సూచించా. ఇంటికి నాణ్యమైన తాళం వేయాలని, సాధ్యమైనంత వరకు విలువైన వస్తువులను ఇండ్లలో ఉంచవద్దని కోరారు.

కుల సంఘాలు పేదలకు అండగా ఉండాలి

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై మాచినేని రవి

చంద్రుగొండ, జనవరి 13: కుల సంఘాలు పేదలకు అండగా ఉండాలని ఎస్సై మాచినేని రవి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రైవేటు కళాశాల ప్రాంగణంలో మున్నూరుకాపు మండల సంక్షేమ సంఘం-2024 నూతన కాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. రామిశెట్టి సైదయ్య, వెలగల మధు, రంగిశెట్టి రాము, అంచ కృష్ణ, లక్ష్మిపతి, బోగి కృష్ణ, రామిశెట్టి వెంకటేశ్వర్లు, గోరంట్ల శ్రీను, గాజుల ప్రసాద్, ఆకుల రాంబాబు, శెట్టిపల్లి క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా క్రికెట్ టోర్నీ

విజేతలకు కప్పులు, బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

సారపాక, జనవరి 13: వైఎంసీ క్రికెట్ టోర్నీ రెండవ రోజు ఉత్కంఠభరితంగా సాగింది. మొదటి మ్యాచ్‌లో బ్లూ క్యాప్స్ భద్రాచలం జట్టు నిర్ణీత 10 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టంతో 116 పరుగులు చేసింది. మనీ ఎలెవన్ బూర్గంపాడు జట్టు 8.3 బంతుల్లో మూడు వికెట్ల నష్టానికి 117 పరుగులతో గెలిచింది. రెండో మ్యాచ్‌లో నగరం జట్టు 10 ఓవర్లలో 88 పరుగులు చేసి నాలుగు వికెట్లు నష్టపోయింది. అశ్వారావుపేట జట్టు ఏడు వికెట్ల నష్టానికి 73 పరుగులు చేసి ఓడింది. మూడవ మ్యాచ్‌లో గుంటుపల్లి ఎలెవన్ భద్రాచలం జట్టు పది ఓవర్లలో 98 పరుగులు చేసి ఎనిమిది వికెట్లు నష్టపోయింది. నాయక్ 11 రేగళ్ల జట్టు 10 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 90 పరుగులు చేసి పరాజయం పాలైంది. నాలుగో మ్యాచ్‌లో బెస్ట్ క్రికెట్ అకాడమీ భద్రాచలం జట్టుపై అచార్య స్టైకర్స్ పాల్వంచ జట్టు గెలుపొందింది.

బూర్గంపాడు, జనవరి 13: మండలంలోని అంజనాపురం గ్రామంలో క్రికెట్ టోర్నమెంటును ఎస్సై రాజ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. స్థానిక యువతకు రెండు క్రికెట్ బ్యాట్‌లను అందజేశారు. ఉప సర్పంచ్ భూక్యా ఆనంద్‌రావు, పీఆర్‌టీయూ నాయకుడు రామారావు, వార్డు సభ్యులు భాస్కర్, చంటి, లింగ పాల్గొన్నారు.

గ్రామాల్లో గంగిరెద్దుల విన్యాసాలు

దుమ్ముగూడెం : గ్రామాల్లో తిరుగుతున్న గంగిరెద్దులు

దుమ్ముగూడెం, జనవరి 13: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో డూడూ బసవన్నల సందడి నెలకొన్నది. రెండు రోజుల ముందు నుంచే పలు గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ నృత్యాలు చేస్తూ చిన్నా పెద్దా అందరిని తమవైపు తిప్పుకుంటున్నాయి. ఇళ్ల ముందుకు వచ్చిన డూడూ బసవన్నలకు బియ్యం, పిండివంటలు ఇస్తున్నారు. సంక్రాంతి వచ్చిందంటే రెండు మూడు రోజుల నుంచి దుకాణాల్లో సందడి కనిపించేది. పల్లెల్లో గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది సంక్రాంతి పండుగ అంతగా కనిపించడం లేదని చెప్పవచ్చు.

హైటెక్ హరి దాసుడు

అశ్వారావుపేట టౌన్, జనవరి 13: సంక్రాంతి వచ్చిందంటే హరిదాసుల చిడతల శబ్దంతో హరిలో రంగ హరి హంటూ.. ఇంటి గుమ్మం ముందు సందడి చేస్తూ కనిపించేవారు. కానీ కాలం మారడంతో కాలానుగుణంగా కులవృత్తులు కనుమరుగవుతున్నాయి. సంక్రాంతి కావడంతో ఓ హరిదాసుడు ద్విచక్రవాహనంపై ఇంటింటికీ వెళ్లి వినూత్నంగా బిక్షాటన చేస్తూ కనిపించాడు. పట్టణంలోని నందమూరి నగర్‌లో ఉంటున్న 70 ఏళ్ళ హరిదాసుడు బొమ్మ కంటి వెంకటదాసు బైక్‌కు సౌండ్ బాక్స్ అమర్చి హరిదాసు కీర్తనలను వినిపిస్తూ బిక్షాటన చేస్తున్నాడు. ఈ చిత్రాలను 'నమస్తే' తన కెమెరాలో బంధించింది.

జాతరకు పోయొస్తాం..!

కరకగూడెం మీదుగా ట్రాక్టర్‌పై మేడారం వెళ్తున్న భక్తులు

కరకగూడెం, జనవరి 13: తెలంగాణ కుంభమేళా మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర వచ్చే నెలలో ప్రారంభమవుతుంది. దీనికి కొందరు భక్తులు ఇప్పటి నుంచే వాహనాల్లో వెళ్తున్నారు. జాతర రోజుల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. అందుకే, కొందరు భక్తులు కొన్ని రోజుల ముందుగానే వెళ్లి మొక్కులు తీర్చుకుంటున్నారు. కరకగూడెం మీదుగా మేడారానికి ట్రాక్టర్‌పై కొందరు భక్తులు వెళ్తుండగా 'నమస్తే' కెమెరా ఇలా బంధించింది.

గిరిజనులకు దుస్తుల పంపిణీ

దుప్పట్లు, నిత్యావసరాలు అందజేస్తున్న నిర్వాహకులు

కొత్తగూడెం అర్బన్, జనవరి 13: జిల్లాలోని పాల్వంచ మండలం ఉల్వనూరు పంచాయతీ పరిధిలో ఉన్న కొత్తూరు గిరిజన ప్రజలకు హ్యాపీటూ హెల్ప్ యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం దుప్పట్లు, బియ్యం, దుస్తులు పంపిణీ చేశారు. పిల్లలకు స్నాక్స్ అందించారు. చలి పెరగడంతో అడవిలో నివసిస్తున్న గిరిజనులు ఇబ్బందిపడకుండా ఫౌండేషన్ సభ్యులు శంకర్ సరస్వతి, మీనాక్షి, నవీన్ సాయం అందించారు. కార్యక్రమంలో నవీన్, మనీష్, లెంటిల్, దిలీప్, రామకృష్ణ తదితరులుపాల్గొన్నారు.

రామారావు మృతికి నివాళి

నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు

కొత్తగూడెం అర్బన్, జనవరి 13: తెలంగాణ ఉద్యమకారుడు తమ్మిశెట్టి వెంకటరామారావు గుండెపోటుకు గురై సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ ఉద్యమకారులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన ప్రముఖపాత్ర పోషించారని కొనియాడారు. సంతాపం తెలిపిన వారిలో వి.శాంతిరాం, శ్రావణబోయిన నర్సయ్య, కృష్ణారావు, ధర్మారావు, ఎడ్ల ఏలియా, కాకెల్లి సైమన్, మాత్యూస్, సప్తార్ బేగ్, శ్రీపాద సత్యనారాయణ, వెంకటయ్య, రజిని, ఖమ్మం లింగయ్య, మౌలానా, సలీం, బాబుఖాన్ ఉన్నారు.

బీఎస్పీ జిల్లా కమిటీ నియామకం

మాట్లాడుతున్న యెర్రా కామేశ్

కొత్తగూడెం టౌన్, జనవరి 13: బీఎస్పీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని ఆ పార్టీ పార్లమెంట్ జోనల్ ఇన్‌చార్జి యెర్రా కామేశ్ అన్నారు. పాల్వంచలోని వర్తకసంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నడిపింటి మధు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో జరిగే ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఎస్పీ జెండా ఎగురవేయాలని కోరారు. అనంతరం జిల్లా నూతన కమిటీని నియమించారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా సిద్దార్థ పూలే, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బూర్గుల కరుణాకర్, జిల్లా కోశాధికారిగా గాడిద దామోదర్, జిల్లా కార్యదర్శి కేసుపాక కృష్ణ, సహాయ కార్యదర్శిగా భాగవతపు సతీష్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నాగుల రవికుమార్‌ను నియమించారు. జిల్లా ఇన్‌చార్జులు తాడికల శివకుమార్, నల్లగట్ల రఘు, జిల్లా సలహాదారు గంధం మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

ఆదివాసులకు రగ్గులు పంపిణీ

ములకలపల్లి, జనవరి 13: పీపుల్ హెల్పింగ్ చిల్డ్రన్స్ సంస్థ సహకారంతో మండలంలోని తాళ్లపాయ పంచాయతీ వలస ఆదివాసీ గ్రామాలైన కొమరంభీం నగర్, ఊటచెరువు గిరిజనులకు కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు రగ్గులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చలి తీవ్రత దృష్ట్యా వలస ఆదివాసులకు రగ్గులు అందజేస్తున్నామని అన్నారు. సర్పంచ్ బైటి రాజేష్, పుష్పాల కుటుంబ సభ్యులు పుష్పాల చందర్‌రావు, హనుమంతరావు, సాయి పాల్గొన్నారు.

రగ్గులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాధాకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు

నైవేద్యాలను సమర్పించి పూజలు చేస్తున్న మహిళలు

పాల్వంచ, జనవరి 13 : పట్టణంలోని కేటీపీఎస్ ఏ కాలనీలో ఉన్న శ్రీ రుక్మిణి రాధాకృష్ణ ఆలయంలో ధనుర్మాస వ్రతం మహిళలు నిర్వహించారు. మహిళలు భారీ సంఖ్యలో ఆలయానికి చేరుకొని అమ్మవారికి సారె సమర్పించారు. అమ్మవారికి వివిధ రకాల వంటకాలను సమర్పించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

బియ్యం పట్టివేత

పాల్వంచ రూరల్, జనవరి 13 : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పాల్వంచ రూరల్ పోలీసులు శనివారం పట్టుకున్నారు.మండలంలోని లక్ష్మీదేవిపల్లి(యూ) నుంచి పోశెట్టి నరేశ్ తన ట్రాలీలో బంగారుచెలక వైపు 11 క్వింటాళ్ల రేషన్ బియ్యం వేసుకుని వెళ్తున్నాడు. అదే సమయంలో ఉల్వనూరులో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో బియ్యంతోపాటు ట్రాలీని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నరేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని వ్యక్తి మృతి

పాల్వంచ రూరల్, జనవరి 13: మండలంలోని జగన్నాథపురంలో విషాదం చోటుచేసుకున్నది. సంక్రాంతి పండుగ కోసం ఇంటికెళ్తూ ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొని టేకులపల్లి సంపత్‌నగర్‌కు చెందిన వల్లపు శ్రీను(42) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సాలో కూలి పనులు చేస్తున్న శ్రీను పండుగకు తన సోదరుడి కొడుకు సంతోష్‌తో కలిసి సొంతూరు సంపత్‌నగర్ వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. జగన్నాథపురం శివారులో కొత్తగూడెం నుంచి వస్తున్న ద్విచక్రవాహనం వీరి వాహనాన్ని వేగంగా ఢీకొట్టింది. దీంతో శ్రీనుకు తీవ్రగాయాలు కాగా సంతోష్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఇద్దరిని పాల్వంచ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శ్రీను మృతిచెందాడు. భార్య మంగ ఫిర్యాదు మేరకు పాల్వంచరూరల్ ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో క్రీడల సందడి

పాల్వంచ రూరల్, జనవరి 13: సంక్రాంతి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో క్రీడాపోటీలు జరుగుతున్నాయి. స్థానిక నాయకులు క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందిస్తున్నారు. లక్ష్మీదేవిపల్లి(ఎస్), కేశవాపురం, బసవతారక కాలనీ సర్పంచులు విజయ్‌కుమార్, కాశమ్మ, బాలు క్రికెట్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులందించారు. చంద్రాలగూడెం, రేగులగూడెంలలో స్థానిక యువతకు వాలీబాల్ పోటీలు నిర్వహించి వజ్జా బాబు నగదు బహుమతులను అందించారు.